క్లుప్తంగా

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి
ఏపీడీ రవీందర్


మహిళలకు అల్లం, వెల్లుల్లి పేస్టును పంపిణీ చేస్తున్న ఏపీడీ రవీందర్

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళలు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీడీ రవీందర్ అన్నారు. చిన్నకోడూరులో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన అల్లం, వెల్లుల్లి పేస్టును సోమవారం సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం అందించే రుణాలతో చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసుకొని కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. పురుషులతో సమానంగా అన్నింటా మహిళలు రాణించాలన్నారు. మహిళలు చదువుకుంటే కుటుంబం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, డీఎంజీ వేణుగోపాల్, సీసీలు శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రాజు, కొమురయ్య, రాజ్‌కుమార్, సేనాపతి, వీఓఏలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన దుబ్బాక విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థులు

దుబ్బాక: గుజుర్యు కరాటే అకాడమీ తెలంగాణ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన ఇండో నేపాల్ కరాటే పోటీల్లో దుబ్బాక కేజీబీవీకి చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు కరాటే మాస్టర్ బురాణి శ్రీకాంత్ సోమవారం తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే పోటీలలో 2 వేల మంది పాల్గొన్నారన్నారు. పోటీల్లో ముగ్గురు విద్యార్థులు బంగారు, 11 మంది రజిత, ఆరు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన అక్షయ, లౌకిక గోల్డ్ మెడల్, రేవతి, లయ, సాక్షి, వైష్ణవి, కావ్య తదితరులను కరాటే మాస్టర్స్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మస్టార్స్ శ్రీనివాస్ రెడ్డి, ముక్తేశ్వరి, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సామిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలరాజు

సిద్దిపేటజోన్: సిద్దిపేట రేంజ్ సామిల్స్, టింబర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలరాజు, ఉపాధ్యక్షుడిగా సాయన్నగారి సుందర్, కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా రామచంద్రం, సలహాదారులుగా రాజన్న, బాపురెడ్డి, సత్యనారాయణ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు సన్మానం

సిద్దిపేటకమాన్: ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 14 వరకు రాజస్థాన్ చిత్తోర్గడ్‌లో జరిగే జాతీయ పోటీలకు సౌమ్య, సంజయ్, హేమచందర్ ఎంపికయ్యారు. సోమవారం వారిని సన్మానించారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆకాంక్షించారు.

ప్రథమ స్థానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో సిద్దిపేట శ్రీవాణి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ సత్యం సోమవారం తెలిపారు. ఐశ్వర్య, కేదారినాథ్, అనన్య పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కేసు కొట్టివేత

సిద్దిపేటకమాన్: తొగుట మండలంలో 2016లో భూ పోరాటం చేసిన నిర్వాసితులు, వారికి మద్దతు తెలిపిన వివిధ పార్టీలకు చెందిన వారిపై నమోదు చేసిన కేసును సోమవారం కొట్టివేసినట్లు సీపీఎం నాయకుడు మల్లారెడ్డి తెలిపారు. భూ నిర్వాసితుల తరపున ఆందోళన చేయగా కేసు నమోదు చేశారని, జైలుకు వెళ్లినట్లు తెలిపారు. భూ నిర్వాసితులు, నాయకులను సన్మానించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పాతూరు మార్కెట్ వద్ద ప్రజలకు, వ్యాపారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు.
సిద్దిపేటకమాన్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్‌ఐ వినయ్‌సాగర్ సూచించారు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

అలంకార ప్రాయం

- రూ.45 లక్షల వ్యయంతో స్ట్రీట్ లైట్ల ఏర్పాటు
- ప్రారంభించినా వెలగని వైనం
- వినియోగంలోకి తేవాలని గ్రామస్తుల డిమాండ్

ప్రారంభించడంలో ఉన్న ఉత్సాహం నిర్వహణలో మాత్రం ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లు వెలగడంలేదు. అధికారులు పట్టించుకోక పోవడంతో అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి. వాటిని వెంటనే వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


అలంకార ప్రాయంగా మారిన స్ట్రీట్ లైట్లు


వేలాడుతున్న స్ట్రీట్ లైట్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో రెండేళ్ల క్రితం హనుమాన్ దేవాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సుమారు రూ.3.90 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. అందులో డబుల్ డివైడర్లను సైతం నిర్మించారు. పట్టణాలకు ధీటుగా రోడ్డును మరింత సుందరీకరించడానికి వాటి మధ్యలో పూలమొక్కలతో పాటు బటర్ ఫ్లయి స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సంకల్పించారు. అనుకున్నదే తడవుగా మిరుదొడ్డి కొత్త బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఈఎన్‌సీ నిర్వహణ కింద రూ.45 లక్షలతో వ్యయంతో 35 స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఆఘమేఘాల మీద జనవరి 25వ తేదీన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వాటిని ప్రారంభించారు. ప్రారంభించిన రోజు నామమాత్రంగా వెలుగులు చిమ్మాయి. మరుసటి రోజు నుంచి అధికారుల పర్యవేక్షణ కరువైందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్ట్రీట్ లైట్లను ప్రారంభించి వారం పది రోజులు గడుస్తున్నా నిత్యం డివైడర్ పొడవునా అంధకారం నెలకొందని జనాలు మండిపడుతున్నారు. రాత్రి వేళ అత్యవసర సరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా నాణ్యత లేని లైట్లను బిగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



స్ట్రీట్ లైట్లను ఆర్భాటంగా ప్రారంభించారు. వాటిని వినియోగంలోకి తేవాలన్న విషయాన్ని అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారు. కాంట్రాక్టర్లపై కనీస పర్యవేక్షణ లేక పోవడంతో పనులు నాసిరకంగా చేస్తున్నారు. రోజులు గడుస్తున్నా స్ట్రీట్ లైట్లను వెలిగించక పోవడంతో రాత్రి వేళ అంధకారం నెలకొంటోంది. – మద్దెల రాజేష్, మిరుదొడ్డి

వినియోగంలోకి తెస్తాం



స్ట్రీట్ లైట్లకు కాంట్రాక్టర్లు సరైన విద్యుత్ కనెక్షన్ ఇవ్వక పోవడంతో సమస్య నెలకొంది. విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తాం. విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం. స్ట్రీట్ లైట్లను వినియోగంలోకి తెస్తాం. – రాజిరెడ్డి, ఎంపీడీఓ, మిరుదొడ్డి స్పెషల్ ఆఫీసర్

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్


బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: క్రీడాపోటీల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్ అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ ఆవరణలోగల జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాలికల ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభను చాటుకునేందుకు క్రీడాకారులకు ఇలాంటి పోటీలు చక్కని వేదికలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా జట్టు మొదటి స్థానంలో నిలవగా, దుబ్బాక మండలం ధర్మాజీపేటలోని జెడ్పీహెచ్‌ఎస్ జట్టు ద్వితీయ స్థానం, తూప్రాన్ అభ్యాస ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు విజయరేఖ, సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు నవీన్, జైపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తాతో పాటు పలు చోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్నవారిని వారిని పట్టుకొని సిద్దిపేట కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన జడ్జి శ్రావణి ఆరుగురికి రూ.6 వేల జరిమానా, వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

డ్రైవర్‌కు జైలుశిక్ష, జరిమానా

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు గజ్వేల్ కోర్టు జడ్జి ప్రియాంక జైలు శిక్ష, జరిమానా విధించారని గౌరారం ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. 2018లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన సులుగారి సురేష్(26) మృతి చెందాడు. ఈ ప్రమాదానికి కారణమైన ఉత్తరప్రదేశ్ నడిగామ్‌కు చెందిన లారీ డ్రైవర్ తారాచంద్‌పై గౌరారం పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సోమవారం విచారణ అనంతరం జడ్జి ప్రియాంక ముద్దాయికి నెల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

పోలీసులకు సమాచారం అందించండి

హుస్నాబాద్: ప్రజలు ఊరేళితే ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే బ్లూకోట్ టీమ్‌తో అప్రమత్తం చేస్తామని హుస్నాబాద్ సీఐ కిరణ్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ పెరిగిందని, దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత వివరాలు అపరిచితులకు చెప్పొద్దన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ వారియర్స్‌ను నియమించామని సీఐ తెలిపారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

హుస్నాబాద్: యువత రాజకీయాల్లోకి రావాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురామ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సోమవారం ఓటుహక్కు వినియోగం, ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రచురించిన ఓటరు అవగాహన కరపత్రాలను విద్యార్థులకు అందించి ఓటుహక్కు ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..


మాచాపూర్‌లో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా విశ్వాసనిత్, ఎంఈఓగా నిఖిల్, హెచ్‌ఎంగా అభిజ్ఞ, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవయ్య, ఉపాధ్యాయులు దేవదాసు, మంజుల, లావణ్య పాల్గొన్నారు.
మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. డీఈఓగా చరణ్, ఎంఈఓగా అభిరానందన్, హెడ్‌మాస్టర్‌గా గీత, టీచర్లుగా ఉదయశ్రీ, అనూష, కావ్య, సాయి చరణ్ వ్యవహరించారు. విద్యార్థులకు హెచ్‌ఎం కిష్టారెడ్డి, టీచర్లు చంద్రశేఖర్, లోకేష్, మల్లేశం, చంద్రమౌళి బహుమతులు అందజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడంపై మండలంలోని రేబర్తి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శివయ్యగౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడారు. ప్రముఖ గేయ రచయిత అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అందెశ్రీ తమ గ్రామస్తుడు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల్లురి రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బచ్చల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజు, యూత్ అధ్యక్షుడు ఈరిరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు


తోటపల్లి వాగును పరిశీలిస్తున్న సీఐ కిరణ్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ పోలీసు సర్కిల్ పరిధిలో ఇసుకను అక్రమంగా రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎర్రల కిరణ్ అన్నారు. సోమవారం తోటపల్లి కోనేటి వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తీయరాదని, గ్రామస్తులు తమ అవసరాలకు మాత్రమే వాడుకోవాలన్నారు. ఇసుక వ్యాపారం కోసం రైతుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇసుక తరలింపుపై ఎవరు ఫిర్యాదు చేసినా ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్రీడా ప్రాంగణాన్ని కబ్జా చేస్తే చర్యలు


క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): క్రీడా ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పట్టాభి రామారావు, ఆర్‌ఐ నాగరాజు హెచ్చరించారు. సోమవారం మండలంలోని వట్టిపల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో గ్రామానికి చెందిన కొందరు తమ కమ్యూనిటీ భవనాల కోసం ముగ్గు పోస్తున్నారని విషయం తెలుసుకున్న ఎంపీడీఓ, ఆర్‌ఐ, ప్రత్యేక అధికారి అరుణ్ గ్రామానికి చేరుకుని క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. అధికారుల వెంట ఎంపీఓ శ్రీనివాస్ వర్మ, గ్రామ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట గ్రామ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఈనెల 9వ తేదీన నిర్వహించే శ్రీమల్లికార్జున స్వామి జాతర ఏర్పాట్లు పనులను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు ఉన్నారు.

ప్రయోగ పరీక్షల పరిశీలన


గజ్వేల్‌లో ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న హెచ్‌పీసీ సభ్యులు

గజ్వేల్‌రూరల్: ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షల నిర్వహణ తీరును హైపవర్ కమిటీ (హెచ్‌పీసీ)సభ్యులు సోమవారం పరిశీలించారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలలో ప్రయోగ పరీక్షల(ప్రాక్టికల్స్)ను జిల్లా ఇంటర్మీడియట్ హైపవర్ కమిటీ సభ్యులు మంగరాజు, భూపాల్‌రాజు తనిఖీ చేశారు. ప్రయోగ పరీక్షల తీరును పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పరీక్షల డిపార్ట్‌మెంట్ అధికారి వనజ, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రాజు తదితరులున్నారు.


2003-04 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాల ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విద్యా బుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేణుగోపాలచారి, ప్రకాష్‌రెడ్డి, ఓజాలు, కోటి, శ్రీను, రవి, బాబు, హరి, అశోక్, రేణుక, రజని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మర్రిముచ్చాల మాజీ సర్పంచ్ మృతి
కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల మాజీ సర్పంచ్ జంగని రామయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఎంపీపీ తలారి కీర్తన ఆయన పార్థివ దేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామానికి 1986 నుంచి 1993 వరకు సర్పంచ్‌గా సేవలందించారన్నారు. ఆయన చేసిన మరువలేనివన్నారు.

◆ స్నేహితుడి కుటుంబానికి చేయూత
నంగునూరు(సిద్దిపేట): బాల్య స్నేహితుడు అనారోగ్యంతో మరణించడంతో అతని కుటుంబానికి సహచర మిత్రులు చేయూత అందించారు. నంగునూరుకు చెందిన చిప్ప ప్రకాష్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అనారోగ్యంతో ప్రకాష్ ఇటీవలే మృతి చెందాడు. అతడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న తోటి మిత్రులు రూ.40 వేలు సేకరించి చిన్న కూతురు శ్రావణి పేరిట ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు.

◆ నులిపురుగు మాత్రలు వేయాలి
తొగుట(దుబ్బాక): నులిపురుగు నివారణ వారోత్సవాలను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక రైతు వేదికలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన నిర్వహించే నులిపురుగు నివారణ మాత్రలు 1 నుంచి 19 ఏళ్ల వయస్సుగల వారికి వేయాలని సూచించారు. 13 నుంచి 19వ తేదీ వరకు విటమిన్ ఏ శిబిరం నిర్వహించాలన్నారు. 9 నెలల వయసు నుంచి ఐదేళ్ల వయస్సు గలవారికి విటమిన్ ఏ సిరప్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సారిక, సుభాషిణి, సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమ్ముల్, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం
చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని విఠలాపూర్‌లో మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తివాచనం, ప్రధాన దేవతా ఆవాహనం, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం భజన కార్యక్రమాలు చేశారు. అలాగే పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ మహాసభలను విజయవంతం చేయాలి
గజ్వేల్: ఖమ్మంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ సోమవారం కోరారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను సోమవారం ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమ్మెను జయప్రదం చేయాలి
దుబ్బాకటౌన్: దేశ వ్యాప్తంగా ఈ నెల 16న జరిగే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల పిలుపునిచ్చారు. మండలంలోని రామక్కపేట, తిమ్మాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు సోమవారం ఆశ వర్కర్లతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో ఇబ్బందులు
తొగుట(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వ విధానాలతో గ్రామ పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ ఆరోపించారు. ఈనెల 16 నుంచి సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీధర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ 26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

◆ కేన్సర్‌పై అవగాహన ర్యాలీ
సిద్దిపేటకమాన్: కేన్సర్ డేని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్లకార్డులతో పట్టణంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నాసర్‌పూర పీహెచ్‌సీతో పాటు పలు కాలనీల్లో కొనసాగింది. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక
అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పెద్ద తండా గ్రామ కాంగ్రెస్ కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అయిలయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోతు జూమ్లానాయక్, ఉపాధ్యక్షుడిగా గుగులోతు రాజునాయక్, కార్యదర్శిగా గుగులోతు నరసింహులు, ఉపకార్యదర్శిగా గుగులోతు వెంకటేష్, గ్రామ సోషల్ మీడియా కన్వీనర్‌గా గుగులోతు తిరుపతినాయక్, యూత్ అధ్యక్షుడిగా గుగులోతు రవినాయక్, కార్యదర్శిగా గుగులోతు కిషన్‌నాయక్, గౌరవ సలహాదారులుగా గుగులోతు రాంబాబునాయక్, గుగులోతు భాస్కర్ నాయక్ ఎన్నికయ్యారు.

◆ నేర సమీక్షా సమావేశం
హుస్నాబాద్: హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలకు సంబంధించిన ఎస్‌ఐలు, ఇన్వెస్టిగేషన్ అధికారులతో సోమవారం సీఐ కిరణ్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. నేరాల విచారణ పురోగతి, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.

◆ లక్ష్యం దిశగా అడుగులు వేయాలి
వర్గల్(గజ్వేల్): విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గౌరారం ఏఎస్‌ఐ మధుసూదన్, గజ్వేల్ షీ టీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని వేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యలపై షీటీమ్ నంబర్ 8712667434కు సమాచారం అందించాలని సూచించారు.

◆ అరుదైన పాటకు గౌరవం
హుస్నాబాద్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమాన్ని సజీవంగా నిలిపిన జయ జయహే తెలంగాణ పాటకు ఇన్నాళ్లకు అరుదైన గౌరవం దక్కిందని జన జాగృతి కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సంపత్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జయ జయహే తెలంగాణ గీతం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ నినాదమన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ తెలంగాణలోని అన్ని పాటలను ఈ పాటలో పొందుపరిచి తెలంగాణ విశిష్టతను ప్రపంచానికి ఎలుగెత్తి చాటారని కొనియాడారు.

◆ కాంగ్రెస్ పాలనలో రైతుకు మేలు
సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పాలనలో రైతులు మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల పరిధి జక్కాపూర్‌లో గంగమ్మకు జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. రంగనాయక సాగర్ ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల చేయడం వల్ల 70 వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు.